ఆదమరిస్తే అంతే..

- ఆడుకునే చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తుండాలి
- నీటి సంపులు, విద్యుత్ పరికరాలతో పొంచి ఉన్న ప్రమాదం





మానకొండూర్: తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారికోసం ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ జీవిస్తుంటారు. పిల్లలను ప్రయోజకులుగా చేయాలని ఎన్నో కలలు కంటుంటారు. బుడిబుడి నడకలతో, అచ్చిరాని మాటలతో నవ్విస్తూ ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న చిన్నారుల ప్రాణాలు క్షణాల్లో గాల్లో కలుస్తున్నాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పిల్లల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే అంతే సంగతులు. ఆటలాడుకుంటూ నీటి సంపుల్లోపడి మృత్యువాతపడుతున్నారు. చిన్నారుల మృతి జీవితాంతం తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగుల్చుతోంది. ఇళ్ల సమీపంలో ఆడుకునే, ఇంటి నుంచి బయటకు వెళ్లే చిన్నారులపై కన్నేసి ఉంచాలి. ఏప్రిల్‌లో చెంజర్ల గ్రామంలో నిర్మిస్తున్న దాబా వద్ద వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు ట్యాంకు గోడ కూలడంతో రెండో తరగతి చదువుతున్న ఎనిమిదేళ్ల బాలిక మృతి చెందింది. నిజాయితీగూడెం గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి నీటి సంపులో పడి మృతి చెందింది. ఈ నెలలోనే పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. మరికొద్ది రోజుల్లో పాఠశాలల్లో చేరి చదువుకునే చిన్నారుల మృతి తల్లిదండ్రులకు మరిచిపోలేని బాధ, వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులు ఎక్కువ సమయం ఇంట్లోని కుటుంబ సభ్యులతో గడుపుతుంటారు. పిల్లలు ఇంటి దగ్గర్లోనే ఆడుకుంటున్నారని ఆదమరిస్తే ప్రమాదాల బారినపడతారు. ఇంటి ఆవరణలోని నీటి సంపులపై మూత పెట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇంట్లో మొబైల్ ఫోన్లకు చార్జింగ్ పెట్టి స్విచ్ ఆఫ్ చేయకపోవడం చిన్నారులు చార్జర్‌ను నోటిలో పెట్టుకోవడం, బాత్‌రూంల్లో వాటర్ హీటర్ వంటి వాటితో ప్ర మాదం పొంచి ఉంది. చిన్నపిల్లలకు అందే ఎత్తులో వివిధ రకాల వస్తువులు పెట్టకపోవడమే మంచిది.

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న కులసంఘాల అధ్యక్షులు

చొప్పదండి: మండల కేంద్రంలోని సమ్మక్క, సారలమ్మ, దుర్గామాత ఆలయాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కులసంఘాల అధ్యక్షులు ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇరవై ఏళ్లుగా చొప్పదండి పట్టణ శివారులో జాతరలు జరుగుతున్నాయని, రోడ్డు బురదమయంగా మారడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణాని కృషి చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నిర్వాహకులు చీకట్ల లచ్చయ్య, దండె రాజయ్య, వడ్లూరి సుధాకర్, క్యాతం పురుషోత్తం, నలుమాచు రామక్రిష్ణ, దండె రవీందర్, తదితరులున్నారు.

నేడు 2 కె రన్

హుజూరాబాద్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో సోమవారం వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఆదివారం తెలిపారు. యువత, క్రీడాకారులు, వాకర్స్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే రన్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కల్వల ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలి

వీణవంక: మూడు మండలాలకు వరప్రదాయిని కల్వల ప్రాజెక్టుకు ఇప్పటి వరకు మరమ్మతులు చేయకపోవడం వల్ల వానాకాలం సాగుపై రైతుల్లో ఆయోమయం నెలకొందని వీణవంకకు చెందిన రైతు అమ్మత ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు లేక పోవడంతో నారు పోసుకోవాడానికి రైతులు వెనకడుగు వేస్తున్నారని, ఇప్పటికే రెండు సార్లు రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు కానీ వర్షాలు కురిస్తే ప్రమాదం పొంచి ఉందని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు.

జంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గన్నేరువరం: కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం జంగపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 120 మందికి ఆసుపత్రి వైద్యులు వివిధ పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ... గ్రామంలోని ముదిరాజ్‌లతో పాటు అందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. శిబిరంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోతి ఆంజనేయులు, ట్రెజరర్ జీర్ర ఆంజనేయులు, సంఘం డైరెక్టర్లు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంజీవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు

జమ్మికుంట: బూతులు తిడుతూ, చంపుతామని బెదిరించిన ముగ్గురిపై ఆదివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన పైడిపల్లి స్వప్నను అదే గ్రామానికి చెందిన పైడిపల్లి రాజ్‌కుమార్, వరలక్ష్మి, రాకేశ్ పాత పగ మనుస్సులో పెట్టుకొని శనివారం ఇంటికి వచ్చి బూతులు తిడుతూ, చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలి భర్త శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో..

ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టణానికి చెందిన బోళ్ల అఖిల్, ఎండీ సోహెల్ బైక్‌పై వెళ్తుండగా మడిపల్లి మూల వద్ద సిద్దంశెట్టి ప్రభాకర్ అజాగ్రత్తగా బైక్ నడుపుతూ వచ్చి ఢీకొట్టాడు. సోహెల్‌కు గాయాలు కాగా అఖిల్ ఫిర్యాదుతో ప్రభాకర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పరామర్శ

వీణవంక: మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను ట్యూరిటో, యువ్ టీవీ సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. వెంట మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్, అమృత ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ సమ్మిరెడ్డి, చిట్టి, రవి, లోకేశ్, రాకేశ్, కొంరయ్య, తాళ్లపల్లి కుమారస్వామి, నాగరాజు ఉన్నారు.

సాంకేతిక విజ్ఞానం వినియోగించుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

మానకొండూర్: సాంకేతిక విజ్ఞానం వినియోగించుకోవాలని భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సునీత, శివకుమార్ రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని గంగిపల్లి ధనలక్ష్మీ ధాన్యవిత్తన రైతు పరస్పర సహకార సంఘం, మానకొండూర్ రైతువేదికలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ శిక్షణ కార్యక్రమం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సంపన్న రైతు దేశానికి గర్వ కారణం అనే ఉద్దేశంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంను మే 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో సమస్యలను ఎదుర్కోవడం వంటి అంశాలు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త విజయ్, సేద్య విభాగ శాస్త్రవేత్త ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు వంశీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

వీణవంక: తెలంగాణ ట్రాక్టర్ యూనియన్ బేతిగల్ గ్రామ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొట్టిముక్కుల రవీందర్ రావు, ఉపాధ్యక్షుడిగా కంబాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాటం రవి, కోశాధికారిగా బొమ్మదేని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పల్లెర్ల శ్రీనివాస్, చొప్పరి సారయ్య, రవి, రాజిరెడ్డి, చొప్పరి సంపత్, అంజి, కంబాల బీరయ్య, ప్రతాప్, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి భూ భారతి గ్రామసభలు

చిగురుమామిడి: మండలంలోని 11 రెవెన్యూ గ్రామాల్లో 3వ తేదీ నుంచి భూభారతి గ్రామసభలు నిర్వహించనున్నామని చిగురుమామిడి తహసీల్దార్ ఎం రమేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 3న కొండాపూర్, 4న చిన్నముల్కనూర్, 5, 6వ తేదీల్లో ఇందుర్తి గ్రామ పరిధి గునుకులపల్లె, గాగిరెడ్డిపల్లి, ఓగులాపూర్, 9, 10వ తేదీల్లో చిగురుమామిడి పరిధి పీచుపల్లి, సీతారాంపూర్, లంబాడిపల్లి, 12న రేకొండ, 13న నవాబుపేట, 16న బొమ్మనపల్లి, 17, సుందరగిరి, 18న రామంచ, 19న ముదిమాణిక్యం, 20న ఉల్లంపల్లిలో సభలు నిర్వహిస్తామన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే గ్రామసభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీమానసాదేవి ఆలయంలో విశ్వగురు స్వర్ణ యుగం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయంలో అమ్మ భగవాన్ భక్తులు ఆదివారం స్వర్ణయుగం కార్యక్రమం నిర్వహించారు. గర్భగుడిలోని శ్రీలక్ష్మీఅమ్మవారితోపాటు శ్రీపరంజ్యోతి అమ్మభగవాన్‌కు మంగళహారతి ఇచ్చి కార్యక్రమం ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ఎంత ఐశ్వర్యం ఉన్న అనారోగ్యంతో ఐశ్వర్య ఫలాలను అనుభవించడం లేదని, మనిషి క్రమశిక్షణ, అలవాట్లు, అభిరుచులపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ఎలాంటి అలజడి, సంఘర్షణ లేని జీవన విధానం శ్రీఅమ్మభగవాన్ ప్రోగ్రాం ద్వారా భక్తులకు వివరిస్తున్నామని దాసోజి తెలిపారు. ఆనందం, ఐశ్వర్యం, అభివృద్ధిపై నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు వీక్షించారు. అనంతరం భక్తులు భగవాన్ పాదుకల ద్వారా ఆరోగ్య దీక్షను తీసుకున్నారు. కార్యక్రమానికి సహకరించిన ఆలయ చైర్మన్ ఎలేటి చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాదాపూర్ అమ్మ భగవాన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ సతీశ్‌రెడ్డి, మాదాపూర్ టెంపుల్ ఇంచార్జి తోట రామచంద్రరావు మంజులాజీ, కార్యక్రమ ఆర్గనైజర్ ఓరుగంటి సంపత్, భక్తులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి పథకాలు



పాల ఉత్పత్తిదారుల సమావేశంలో నాగయ్య

చిగురుమామిడి: పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం కరీంనగర్ డెయిరీ పనిచేస్తోందని హుస్నాబాద్ పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ చింతపూల నాగయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ ద్వారా అధిక లాభాలు గడించవచ్చన్నారు. మండలంలో 22 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలున్నాయని, వాటిలో సుందరగిరి ముందంజలో ఉందన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద పాడిపశువులను రుణం కింద అందించనుందన్నారు. చింతపూల సాయన్న, చెల్పూరి సదానందంను పాల ఉత్పత్తిదారుల సంఘానికి డైరెక్టర్లుగా సభ్యులు ఎన్నుకున్నారు. వీరిని నాగయ్య శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ మల్లయ్య, డైరెక్టర్లు సుగుణ, మహేశ్, దశరథం, లక్ష్మయ్య, హనుమల్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ మిల్క్ డే

విద్యానగర్(కరీంనగర్): ప్రపంచ పాల దినోత్సవాన్ని ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాకర్స్, క్రీడాకారులు, వేసవి క్రీడల శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పాలు, బిస్కెట్స్, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, కరీంనగర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు...అర్కండ్ల గ్రామానికి చెందిన నేదురు భూమయ్య ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ముత్తారం గ్రామంలో ఓ వ్యక్తి బైక్‌తో ఢీకొట్టాడు. భూమయ్యకు తీవ్రగాయాలు కాగా 108లో ఆస్పత్రికి తరలించామన్నారు.

'గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

కరీంనగర్: విద్యార్థులే మరుగుదొడ్లు కడగాలని ఆదేశాలు ఇచ్చిన ఎస్సీ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ మరుగుదొడ్లను శుభ్రపరిస్తే తప్పేంటని ఐఏఎస్ అధికారి అలుగు వర్షిణీ తిరిగి ప్రశ్నిస్తున్నారని, వారి పిల్లలు కూడా బడిలో కడుగుతున్నారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈవిషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలుగు వర్షిణిని వెంటనే విధుల నుంచి తొలగించి, విద్యార్థులకు ఆత్మగౌరవాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ప్రమాణ స్వీకారం

కరీంనగర్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బాలాజీనగర్, శ్రీనిధి, అక్షర క్లబ్‌ల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం జ్యోతినగర్‌లో ఘనంగా జరిగింది. బాలాజీనగర్ క్లబ్ అధ్యక్షుడిగా ఎ. రవీందర్ రెడ్డి, అక్షర క్లబ్ అధ్యక్షుడిగా కె. శ్రీనివాస్, శ్రీనిధి క్లబ్ అధ్యక్షుడిగా జి.కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ ఎ.శివప్రసాద్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ హన్మండ్ల రాజిరెడ్డి, సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఎంఎల్ఎన్ రెడ్డి, రమణారెడ్డి, సంతోష్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సంపత్‌కుమారి, మల్లారెడ్డి, సీతారాంరెడ్డి, క్రిష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన జూడో శిక్షణ శిబిరం

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని లారా జూడో అకాడమీలో ఏప్రిల్ 23నుంచి నిర్వహిస్తున్న జూడో వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి దోహదపడే జూడో క్రీడలో క్రీడాకారులు అత్యున్నతమైన టెక్నిక్‌లు నేర్చుకున్నారు. ఉడుం పట్టు లాంటి జూడో క్రీడలో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని జూడో అకాడమీ డైరెక్టర్, కోచ్ మాకు శ్రీధర్‌కుమార్ అన్నారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు లారా జూడో అకాడమీ డైరెక్టర్ మాకు రాజశంకర్ ట్రాక్ షూట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంట: తనుగుల ప్రభుత్వ పాఠశాల 2007-08 పదో తరగతి విద్యార్థులు



హుజూరాబాద్‌లో 1999-2000 పదో తరగతి విద్యార్థులు..



జమ్మికుంటలో 1999-2000 పతో తరగతి విద్యార్థులు

హుజూరాబాద్/జమ్మికుంట: హుజూరాబాద్ టౌన్‌లోని నాగార్జున పాఠశాల, జమ్మికుంట పట్టణంలోని గౌతమి హైస్కూల్ 1999–2000 పదో తరగతి విద్యార్థులు, జమ్మికుంట మండలంలోని తనుగుల ప్రభుత్వ పాఠశాల 2007–08 పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్నారు. చదువు చెప్పిన టీచర్లను ఘనంగా సన్మానించారు.



చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామ శివారులో సీపీడబ్ల్యూఎస్ (సెంట్రల్ ప్రొటెక్టెడ్ వాటర్ సప్‌లై స్కీం) గ్రిడ్ పక్కన కాంపౌండ్‌ను తాకుతాయనేలా విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయి. చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోవడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. కాగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వందమీటర్ల దూరం కూడా ఉండదు. మేత కోసం పశువులు, గొర్లకాపరులు అటుగా వెళ్తే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారులు తక్షణం స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్ ట్రాన్స్‌కో ఏఈఈ, చిగురుమామిడి, సెల్ నం : 94408 11449

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో వొడితెల ప్రణవ్, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల నెరవేరనుందని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి ధర్మారంలో మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి ఆధ్వర్యంలో పట్టణ పరిధి 19, 24 వార్డుల్లోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఇవ్వలేదని విడతల వారీగా అర్హులకు ఇళ్లు అందుతాయని, ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, ఎర్రం సతీష్‌రెడ్డి, సుంకరి రమేష్, సాయిని రవి, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య, రేణుకశివకుమార్, మేడిపల్లి రవీందర్, ఎలగందుల శ్రీహరి, పిట్టల రమేష్, దేశిని సదానందం, రావికంటి రాజు, దిడ్డి రామ్మోహన్, రాజయ్య, బిట్ల మోహన్,గడ్డం దిక్షత్, సలీం, పోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న వీర బుచ్చయ్య

కరీంనగర్‌రూరల్: మున్నూరు కాపు ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మున్నూరుకాపు ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీర బుచ్చయ్య పటేల్ తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మెజార్టీ సభ్యుల సూచనల మేరకు సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేకంగా కమిటీని నియమించి మండలస్థాయిలో సంఘం కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి కామ సతీశ్, ప్రతినిధులు ఆకుల సంజీవరావు, సాయినేని నరేందర్, సాగర్, శ్రీగిరి శ్రీనివాస్, వంగ సుధాకర్, పెరుక నర్సయ్య, ఉమామహేశ్వర్, దాసరి రాజన్‌బాబు, గాజుల మహేందర్, మామిడి కృష్ణ, వరాల మల్లేశం, ఎర్రం మల్లేశం, పవన్, మధు, రాకేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

కరీంనగర్: 2025–26 ఖరీఫ్ సీజన్ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మరో ద్రోహమని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను, ఆయా రాష్ట్రాల సిఫార్సులను పూర్తిగా విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. 2025–26 ఖరీఫ్ కోసం రూ.2.07 లక్షల కోట్ల విలువైన ఎంఎస్‌పీ ప్యాకేజీని ఆమోదించడం ద్వారా రైతులకు పెద్ద ప్రోత్సాహాన్ని ఇచ్చామని బీజేపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుందన్నారు. కార్పొరేట్ మీడియా వెంటనే ఈ వాదనలో చేరి కొత్త ఎంఎస్‌పీ ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 50 శాతం లాభాన్ని నిర్ధారిస్తుందనే వాదనను చేసిందన్నారు. 2024–25లో తెలంగాణ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.16 వేలు డిమాండ్ చేయడం గమనార్హం అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు, రాష్ట్రాల సిఫార్సులకు అనుగుణంగా ఎంఎస్పీ ధరలు సవరించాలని డిమాండ్ చేశారు.

నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం

కరీంనగర్‌టౌన్: పదో తరగతిలో ఉత్తీర్ణులైన నిరుపేద, తల్లిదండ్రులు లేని విద్యార్థుల పై చదువుల కోసం సంక్షేమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేసేందుకుని నిర్వహించినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు అప్పిడి రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పదోతరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు, తల్లి, తండ్రి లేని విద్యార్థులు, 470పై మార్కులు సాధించిన విద్యార్థులకు కపిల్ విద్య వారధి పేరుతో ఆర్థిక చేయూతనివ్వడానికి అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ఇందు కోసం సంస్థ ఈనెల 8న నిర్వహించనున్న అర్హత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన 10 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారు ఏ కోర్సు చేసిన, జీవితంలో వారికి నచ్చిన ఏ వృత్తిలోనైనా స్థిరపడే వరకు సంస్థ ద్వారా ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, 8న కరీంనగర్‌లో అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు.

గంగిపల్లిలో పోచమ్మ బోనాలు

మానకొండూర్: గంగిపల్లిలో ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లి జాతరలో భాగంగా ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.